



RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక



విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతీ యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో
వార్తా సేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979



నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 10, జులై 2026 | సంపుటి :16 సంచిక :96 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00




గగన్‌యాన్ యాత్రకు

## ఆస్ట్రేలియా ఊతం..

భారతదేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు అంతర్జాతీయంగా భారీ మద్దతు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌కు మద్దతుగా ఆస్ట్రేలియాకు చెందిన కోకోస్ (కీలింగ్) దీవులలో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.

2



ఢిల్లీలో భారీ జాబ్ స్కాం..

## లక్షల్లో దోచుకున్న కేటుగాళ్లు

ఢిల్లీలో నిరుద్యోగులను విచిత్రమైన తీరులో కేటుగాళ్లు మోసం చేశారు. ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఈ ముఠా లక్షల్లో టోకరా వేసింది. ఈ భారీ జాబ్ స్కాం రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ ఉద్యోగి చిరాగ్ అగర్వాల్ కూడా ఉన్నారు.

2



ముగిసిన గడువు.. వాట్సాప్‌నకు

## మరో ఛాన్స్ లేదు: కేంద్ర ప్రభుత్వం

వాట్సాప్ 'యూజర్‌నేమ్' నోటీసుల గడువు ఈరోజు(గురువారం)తో ముగిసిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. గడువు పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నోటీసులపై వాట్సాప్ (మెటా) యాజమాన్యం నేడు సమాధానం ఇవ్వనుంది. కేంద్రం అనుమతి ఇచ్చే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను తీసుకురాబోమని వాట్సాప్ స్పష్టం చేసింది. వాట్సాప్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపించింది. వాట్సాప్‌లో ఫోన్ నంబర్ లేకుండా చాట్ చేసుకునే 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

2



# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

- ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్
- భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది
- మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం
- కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ
- పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నాం
- ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు
- దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వార్త 2లో

తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం)జిల్లా పర్యటనలో భాగంగా సీతారాం పూర్ ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునికి నెక్స్ట్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన

## స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'



2

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్ఆర్ఐలు హాజరయ్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు.ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని ఆల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

2



## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

కేసీఆర్‌కు నమ్మకం లేకనే

## హరీశ్‌రావును ఆ పదవి నుంచి తొలగించారు: మంత్రి ఉత్తమ్



మాజీ మంత్రి హరీశ్‌రావుకి ( మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. పదవి నుంచి తీసేశారని విమర్శించారు.

2

2



## కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి ఇవ్వలేదు: భట్టి విక్రమార్క

2



## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: ఎమ్మెల్యే పాయల్ శంకర్

# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

- ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్
- భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది
- మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం
- కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ
- పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నాం
- ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు
- దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం)జిల్లా పర్యటనలో భాగంగా సీతారాంపూర్ ప్రీమి యర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునికి నెక్ట్స్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నామని సీఎం తెలిపారు. ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు కేటాయిస్తామన్నారు. మధ్య పారిశ్రామికవాడలు ఏర్పాటు కానున్నాయన్నారు. అవతల అగ్రి ఎకానమీ డెవలప్ చేస్తున్నామని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే ఉండాలన్నారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## గగన్‌యాన్ యాత్రకు ఆస్ట్రేలియా ఊతం..

### కోకోస్ దీవుల్లో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్

మెల్‌బోర్న్, న్యూస్‌వార్ ప్రతినిధి

భారతదేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు అంతర్జాతీయంగా భారీ మద్దతు లభించింది. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌కు మద్దతుగా ఆస్ట్రేలియాకు చెందిన కోకోస్ (కీలింగ్) దీవులలో తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా నిన్న ఆస్ట్రేలియా చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీతో మెల్‌బోర్న్‌లో జరిపిన సంయుక్త మీడియా సమావేశంలో అల్బనీస్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక, సాంకేతిక బంధానికి ఈ నిర్ణయం అద్దం పడుతోంది.

## ఢిల్లీలో భారీ జాబ్ స్కాం.. లక్షల్లో దోచుకున్న కేటుగాళ్లు

ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

ఢిల్లీలో నిరుద్యోగులను విచిత్రమైన తీరులో కేటుగాళ్లు మోసం చేశారు. ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఈ ముఠా లక్షల్లో టోకరా వేసింది. ఈ భారీ జాబ్ స్కాం రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ ఉద్యోగి చిరాగ్ అగర్వాల్ కూడా ఉన్నారు. ఐటీ ఆఫీస్ లోపలే నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించి కేటుగాళ్లు బాధితులను నమ్మించారు. ఏకంగా కార్యాలయం ప్రాంగణంలోనే నకిలీ ఇంటర్వ్యూలు, ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించడం గమనార్హం. ఢిల్లీ సివిక్ సెంటర్‌లోని ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని ఈ నకిలీ నియామకాల పర్వం కొనసాగింది. సోషల్ మీడియాలో నకిలీ ప్రకటనల ద్వారా నిరుద్యోగ యువతను ఈ ముఠా ఆకర్షించింది. ఒక్కొక్కరి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. గతంలో 15 ఏళ్ల పాటు ఐటీ శాఖలోనే పనిచేసిన అనుభవంతో బాధితులను ఆఫీస్ లోపలికి నిందితుడు చిరాగ్ తీసుకెళ్లాడు. నకిలీ వెరిఫికేషన్ ఫాంలు, సర్వీస్ బుక్‌లు చూపించి ఈ ముఠా సభ్యులు నమ్మించారు. అజ్మేరి గేట్ బాధితుడి ఫిర్యాదుతో టెక్నికల్ సర్వైలెన్స్ ద్వారా నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, బాధితుల నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి కోసం ఢిల్లీ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

## ముగిసిన గడువు.. వాట్సాప్‌నకు మరో ఛాన్స్ లేదు: కేంద్ర ప్రభుత్వం

ఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

వాట్సాప్ 'యూజర్‌నేమ్' నోటీసుల గడువు ఈరోజు(గురువారం)తో ముగిసిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. గడువు పొడిగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నోటీసులపై వాట్సాప్ (మెటా) యాజమాన్యం నేడు సమాధానం ఇవ్వనుంది. కేంద్రం అనుమతి ఇచ్చే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను తీసుకురాబోమని వాట్సాప్ స్పష్టం చేసింది. వాట్సాప్‌తో పాటు టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకు కూడా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు పంపించింది. వాట్సాప్‌లో ఫోన్ నంబర్ లేకుండా చాట్ చేసుకునే 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కొత్త ఫీచర్ వల్ల దేశంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగే ముప్పు ఉందని ఐటీ శాఖ హెచ్చరించింది. వినియోగదారుల ఫోన్ నంబర్లు దాచిపెడితే నేరస్థులను ట్రాక్ చేయడం కష్టమవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వానికి పూర్తి సంతృప్తి కలిగే వరకు ఈ ఫీచర్‌ను లాంచ్ చేయొద్దని మెటా సంస్థకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే యూజర్‌నేమ్ ఫీచర్ వాడుతున్న టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకూ నోటీసులు జారీ చేసింది. టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌ల వివరణ కోసం మరికొంత సమయం కేటాయించినట్లు ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. సైబర్ మోసాల అదుపునకు తాము మల్టీ-లేయర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వాట్సాప్ ప్రతినిధి తెలిపారు. ప్రముఖులు, ప్రభుత్వ ఖాతాల పేర్లను ఇతరులు వాడకుండా ముందే రిజర్వ్ చేస్తామని వాట్సాప్ వివరించింది. దేశంలో వాట్సాప్‌నకు రూ.50 కోట్లకు పైగా యూజర్లు ఉన్నందున భద్రతపై రాజీ పడేది లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలు, టెలిగ్రామ్ పైరసీ వ్యవహారాలపై కూడా కేంద్రం ఇటీవలే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్




హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది.

## కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి ఇవ్వలేదు: భట్టి విక్రమార్క

ఖమ్మం జిల్లా, న్యూస్‌వార్ ప్రతినిధి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (దీప్తుఘ్అ ఎఱనెతీఘఝతీఘ) వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## మెల్‌బోర్న్‌లో మోదీకి ఘన స్వాగతం.. మార్వెల్ స్టేడియం 'హౌస్‌ఫుల్'

ఇంటర్నెట్ డెస్క్:

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి మెల్‌బోర్న్ మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 వేల మందికిపైగా ఎన్ఆర్ఐలు హాజరయ్యారు. దీంతో ఒక్కసారిగా స్టేడియమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్.. మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యం పట్ల ఆస్ట్రేలియా ప్రజలు, ప్రధాని అల్బనీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సిడ్నీలో గతంలో రెండుసార్లు ప్రవాస భారతీయులను కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు మోదీ. అహ్మదాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఉంటే, మెల్‌బోర్న్‌లో ఐకానిక్ స్టేడియం ఉందని పేర్కొన్నారు. అయితే.. నేడు మార్వెల్ స్టేడియంలో అభిమానుల సందడి నెలకొనడంతో 'ఈ షో హౌస్‌ఫుల్.. బ్లాక్‌బస్టర్' అని మోదీ వ్యాఖ్యానించగా.. అక్కడివారు ఒక్కసారిగా హర్షధ్వానాలతో హోరెత్తించారు. 'భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయి. ఈ బంధాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకం.



మెల్‌బోర్న్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పుడు 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందుతున్నాయి' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని విజనరీ నాయకుడిగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారన్న అల్బనీస్.. మోదీ తమకు ఆప్తమిత్రుడని కొనియాడారు. ఆయన నాయకత్వంలో భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ప్రశంసించారు.

## కేసీఆర్‌కు నమ్మకం లేకనే హరీశ్‌రావును ఆ పదవి నుంచి తొలగించారు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ( మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్‌లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమత్తులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వండి అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం: ఎమ్మెల్యే పాయల్ శంకర్

న్యూఢిల్లీ:

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# విరాళాల కైంకర్యం.. హిందువులకు ద్రోహం

మన దేశంలో లెక్కలేనన్ని దేవాలయాలు, మఠాలు, పీఠాలు, ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నాయి. వాటిల్లో అవినీతి, నిధుల దుర్వినియోగం, ఆస్తుల దురాక్రమణలు సర్వసాధారణంగా జరుగుతూ ఉంటాయి. చివరకు ప్రభుత్వాలు సైతం వాటి నిధులు, ఆస్తులపై కన్నువేసి, వాటిని కైవసం చేసుకునే ప్రయత్నం చేస్తుంటాయి. అటువంటి వాటిని ప్రజలు కేవలం ఓ అవినీతి చర్యగా, అధికార దుర్వినియోగ ప్రక్రియగా మాత్రమే చూస్తుంటారు. అయితే అయోధ్యలో జరుగుతున్నది అందుకు పూర్తిగా భిన్నమైనది. దేశంలో వంద కోట్ల మంది హిందువుల మనోభావాలను ఆధారం చేసుకొని, ఓ పెద్ద రాజకీయ, సాంస్కృతిక ఉద్యమ నేపథ్యంలో ఆవిర్భవించిన ఈ దేవాలయంలో ఎంత మొత్తాన్ని, ఎవరెవరు దోపిడీ చేశారన్నది కాకుండా వారిపై హిందువుల విశ్వాసాలను, ఉద్వేగాలను ఘోరంగా దెబ్బతీశారని చెప్పవచ్చు. వారిపై విశ్వాసం ఉంచిన కోట్లాది మంది ప్రజలకు ద్రోహం చేసారని భావించాల్సి ఉంటుంది.

అయోధ్యలో విరాళాల డబ్బును పక్కదారి పట్టించారన్న వార్త దేశాన్ని దిగ్ర్భాంతికి గురిచేసింది. భారతదేశంలో పుణ్యక్షేత్రాలకు కొదువ లేదు, వాటిలో కొన్ని మన నాగరికతంత పురాతనమైనవి కూడా ఉన్నాయి. కానీ అయోధ్యలోని రామ మందిరం భిన్నమైనది. సమకాలీన భారతదేశానికి ఒక రూపాన్నిచ్చిన ఉద్యమం నుండి ఇది పుట్టింది. ఆ ఉద్యమమే భారతీయ జనతా పార్టీ (బిజెపి)ని రాజకీయ రంగంలో అట్టడుగు స్థాయి నుండి నేటి అగ్ర స్థానానికి చేర్చింది. ఈ దేవాలయం రాజరికపు దానధర్మాలతో గానీ, సంస్థాగత పోషణతో గానీ నిర్మాణం కాలేదు. 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవ్యమైన ఆలయ సముదాయ నిర్మాణానికి అయిన రూ. 2,000 కోట్లు పూర్తిగా భక్తుల విరాళాల నుండే సమకూరాయి. ఒక రాజకీయ- సాంస్కృతిక ప్రాజెక్టును వాస్తవరూపంలోకి మార్చిన ద్రవ్యం విశ్వాసమే. ప్రతి ఇటుక, ప్రతి నిర్మాణ శైలిలో ఆ ముద్రలు కనిపిస్తాయి. ఆ విశ్వాసమే మధ్యయుగపు పురాతన ఆలయ పట్టణాన్ని ఆధునిక నగరంగా, ప్రధాన స్థిరాస్తిగా మార్చింది. ~ాశ్రీంశీ =ఘుం - యువతను చిత్తు చేస్తున్న మత్తు ఆ ఆలయమే దీనిని యాత్రికులను ఆకర్షించే కేంద్రంగా మార్చింది. ఇది ఎంతో ప్రశంసలు పొందిన 'మక్కా, వాటికన్' హిందూ రూపంగా పరిగణిస్తున్నారు. పైగా, దేశచరిత్రలో మొదటిసారిగా నేరుగా ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షణలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుప్రీం కోర్టు ఆదేశాలపై ఏర్పాటు చేసిన ట్రస్ట్ ను సైతం హిందూ సంస్థలతో, ఆలయం కోసం దశాబ్దాలుగా ఉద్యమాలు చేసిన వారెవ్వరితో సంప్రదింపులు జరపకుండా పిఎంఒ ఏర్పాటు చేసింది. అక్కడి మొత్తం వ్యవహారాలను పర్యవేక్షిస్తూ ఉండటం, నేడు కీలక అనుమానితుడిగా మారడంతో ఆ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే, చంపత్ రాయ్‌కి ట్రస్ట్‌లో బాధ్యతలు ఇవ్వడంలో విహెచ్‌పికి ఎలాంటి పాత్ర లేదంటూ ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షులు అలోక్ కమార్ స్పష్టం చేశారు. చంపత్ రాయ్ విహెచ్‌పిలో సీనియర్ నాయకుడు, ప్రస్తుతం అంతర్జాతీయ ఉపాధ్యక్షుడే. కానీ ట్రస్ట్‌లో ఆయనను మేము నియమించలేదు. మేము సిఫార్సు కూడా చేయలేదు. అక్కడ విహెచ్‌పికి ప్రాతినిధ్యం వహించడం లేదు అని తేల్చి చెప్పడం గమనార్హం. అంటే పిఎంఒ అభీష్టం మేరకు ఈ నియామకాలు జరగడమే గాక, అక్కడి వ్యవహారాలు అన్ని కేంద్రీకృతమై ఉన్నాయని వెల్లడి అవుతుంది. చివరకు ఓ ప్రముఖ పీఠం అధిపతి అయిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆ ట్రస్ట్‌లో సభ్యునిగా నియమించకపోవడమే గాక, ట్రస్ట్ ఏర్పాటులో, ఆలయ నిర్మాణం వ్యవహారాలలో కూడా ఆయనను ఎప్పుడూ సంప్రదించిన దాఖలాలు లేవు. ఓ నిరంతర ప్రక్రియ 2024 ఎన్నికలకు ముందు హడావుడిగా, ఆలయ నిర్మాణం పూర్తికాకుండానే ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రాణ ప్రతిష్ఠ జరిపారు. శ్రీరాముడి అవతారమే మోడీ అన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే, ఇప్పుడు దారుణమైన నిధుల దుర్వినియోగం బైటపడుతూ ఉంటే ప్రధానమంత్రి మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా వంటి వారు మౌనం వహిస్తున్నారు. 2011లోనే విరాళాల చోరీ గురించి సంపత్ రాయ్‌కి ఫిర్యాదు చేస్తే నేరానికి పాల్పడిన వారిపై చర్య తీసుకోకుండా, తనను ఆ ఉద్యోగం నుండి తీసివేశారని ఓ వ్యక్తి సిట్ ముందు వెల్లడించారు. మూడు నెలల ముందే విరాళాల లెక్కింపులో అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిని మార్చాలని తాము చెప్పినా వినిపించుకోలేదని ఎస్‌బిఐ తెలిపారు. వారిలో కొందరు పేరుకు ఎస్‌బిఐ ఉద్యోగులు అయినప్పటికీ వారిని నియమించింది ట్రస్ట్ సభ్యులే కావడం గమనార్హం. 2011 నుండే భూముల కొనుగోలు వంటి వ్యవహారాలలో పలు ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం సిట్ విచారణ కేవలం 45 రోజుల సిసిటివి ఫ్యూటేజ్ మించి ప్రత్యక్ష ఆధారాలు లేవు. అంటూ కీలక నిందితులను సమర్థించే ప్రయత్నం జరుగుతుంది. అయితే, అంతకు ముందు కరసేవలో బుల్లెట్ గాయాలకు గురైనా ఓ స్వయంసేవక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ బిజెపి అధికార ప్రతినిధి నేరుగా ప్రధాన మంత్రికి లేఖలు రాసారు. అప్పుడు పట్టించుకోని ప్రభుత్వం ప్రతిపక్ష నేత అఖిలేశ్ యాదవ్ స్పదించడంతో వచ్చే ఏడాది ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే భయంతో హడావుడిగా సిట్ ఏర్పాటు చేశారు. పిఎంఒ పెద్దల ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తున్న ట్రస్ట్



సభ్యులపై ఆరోపణలు రావడంతో, 'డబుల్ ఇంజిన్' సర్కార్ ఏర్పాటు చేసే సిట్ నిష్పాక్షికత విశ్వసనీయతను నోచుకోలేదు. సామాన్య ఉద్యోగులను అరెస్ట్ చేసి కీలక ట్రస్ట్ సభ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతున్నట్లు స్పష్టం అవుతుంది. విరాళాల చోరీ వెల్లడైన నెలరోజుల తర్వాత సోమవారం జరిగిన ట్రస్ట్ సమావేశంలో సైతం చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించడానికి ట్రస్టు సభ్యులు తొలుత అంగీకరించలేదని తెలుస్తున్నది. అయితే, ట్రస్ట్ నియమాలను రూపొందించిన సీనియర్ న్యాయవాది, ట్రస్టీ కె. పరాశరన్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొని ఒక ట్రస్టీ రాజీనామా సమర్పిస్తే దానిని తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుందని, రాజీనామాను తిరస్కరించే అవకాశం లేదని తేల్చిచెప్పడంతో సాధ్యం కాలేదు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

## రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన

### నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం

### ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం

### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**నాగర్‌కర్నూల్,**

రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర



ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిళిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

### రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్

**విజయవాడ,**

రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు. సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగుతోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

## జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు

**విజయవాడ,**

జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు అందింది. జడా శ్రవణ్ కుమార్ ఆదాయపన్ను ఎగవేశారంటూ కారంపూడి జానకి సుమంత్ ఐటీ శాఖకు ఫిర్యాదు చేశారు. జడా శ్రవణ్ కుమార్‌పై బినామీ ఆస్తుల చట్టంతో పాటు ఆదాయపన్ను చట్టం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని సుమంత్ తన ఫిర్యాదులో కోరారు. కాగా, మత విద్వేషాలు, వైషమ్యాలు రగిలిస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అందిన ఫిర్యాదు మేరకు కొద్దిరోజుల క్రితం జై భీమ్ భారత్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్‌తోపాటు మరికొందరిపై ఏలూరు త్రీ టౌన్, కాళ్ల పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను వ్యక్తిగతంగా దూషించి హేళన చేశారని ఏలూరు గొల్లాయిగూడానికి చెందిన పెద్దాడ వెంకటరమణ, కాళ్ల మండలం సీసలికి చెందిన తోట ఫణిబాబు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, పాలకోడేరు పోలీసు స్టేషన్లలోనూ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదులందాయి.

## మహారాష్ట్రలో ఎడతెరిపిలేని వర్షాలు

**ముంబై,**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలిలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది.

## మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

### హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు

### వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం

### మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్

**అమరావతి**

భారతీయులు, హిందువుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ది పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## తప్పుడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

**అమరావతి**

జోసెఫ్ రావణ్ వ్యవహారంపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు మద్దతు ఎవరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిద్దరు ఏ సంస్కృతికి వారసులు? అని నిలదీశారు. వారి తండ్రులు, తాతలు ఎవరు మూలాలు ఎక్కడ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తప్పుగా మాట్లాడినవారికి చట్టం, సమాజం బుద్ధి చెప్పాలని విజయసాయి రెడ్డి హెచ్చరించారు. అలాంటివారికి యావజ్జీవం లేదా ఉరిశిక్ష వేసినా తప్పులేదని విజయసాయి రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అభ్యంతర వ్యాఖ్యలతో దాడి చేయడం ఫ్యాషన్ అయిపోయిందని విమర్శించారు. మతం మారిన కొన్ని కులాల్లోని కుటుంబాలు.. హిందుత్వంపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ను వైసీపీ సమర్థించడ మంటే.. దేశంపై చేస్తున్న దాడిగానే పరిగణించాలని అన్నారు. దేశద్రోహ కుట్రలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజయసాయి రెడ్డి సూచించారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

# మెడ్చల్-మల్కాజిగిరి డీఎంహెచ్ఓగా డాక్టర్ కె. ఆనంద్ బాధ్యతల స్వీకరణ

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ కె. ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.293 ఉత్తర్వుల మేరకు ఆయనను ఈ పోస్టులో నియమించారు. ఇప్పటివరకు డీఎంహెచ్ఓగా విధులు నిర్వహించిన డాక్టర్ సి. ఉమా గౌరిని పరిపాలనా కారణాలతో రిలీవ్ చేస్తూ, హైదరాబాద్‌లోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుల కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా సేవలందిస్తున్న డాక్టర్ ఆనంద్‌కు మెడ్చల్ ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓగా తక్షణ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ ఆనంద్.. జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ మను చౌదరి, అదనపు కలెక్టర్ (యూఎల్‌బీ) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ ఆనంద్‌కు మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వైద్య పరిపాలనా రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓగా, మెడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా సేవలందించారు. అంతేకాకుండా జిల్లా మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలకు, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిగా కూడా ఆయన విజయవంతంగా విధులు నిర్వర్తించారు. జిల్లాలోని క్షేత్రస్థాయి ఆరోగ్య వ్యవస్థపై ఆయనకున్న విస్తృత అవగాహన ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేందుకు దోహదపడనుంది.

## చౌటుప్పల్లో కోర్టుభవనం కొరకు స్థల పరిశీలన



**చౌటుప్పల్ జులై 9 (న్యూస్ వార్)**

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొరకుభవన పరిశీలన నిమిత్తం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు చౌటుప్పలకు విచ్చేసిన సందర్భంలో కోర్టును పరిశీలించి నూతన కోర్టు ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్,సహాయ కార్యదర్శి మక్తల నరసింహ, కార్యవర్గ సభ్యులు ఎండి ఖయ్యూం పాష, మాజీ అధ్యక్షులు అల్లమోని శ్రీనివాస్, బాల్యం వెంకట చలపతి, జల్లా రమేష్, పరమేష్, రవీందర్, కట్టెల లింగస్వామి, కోర్టు సిబ్బంది ఏవో రామకోటి, చంద్రిక, అమర్ బిన్ నాజీర్, తదితరులు పాల్గొన్నారు.

## మెమొరీ కార్డుల్లో భీమ్‌రెడ్డి ఆస్తుల చిట్టా

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డికి చెందిన కర్ణాటకలోని బినామీ ఆస్తుల వివరాలు తేలాల్సి ఉన్నదని ఏసీబీ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నది. సోదాల సమయంలో భీమ్‌రెడ్డి ఇంట్లో రెండు మెమొరీ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నామని, అందులోని వివరాల ఆధారంగా డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నదని తెలిపారు. భీమ్‌రెడ్డి దగ్గర ఒక డైరీ కూడా స్వాధీనం చేసుకున్నామని, అందులో 'మనకు ఇవ్వాల్సిన వాళ్లు' 'నేను ఇవ్వాల్సినవి' అంటూ రాసుకున్నట్టు చెప్పారు. సోదాల్లో పది బ్యాంకు ఖాతాలు, రెండు లాకర్లు గుర్తించామని, వాటిని పూర్తిస్థాయిలో తనిఖీ, స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నదని అన్నారు.

**ఆస్తులపై విచారణ చేయాలి**

భీమ్‌రెడ్డికి చెందిన కొన్ని ఆస్తులను తన మొబైల్‌లో స్క్రీన్‌షాట్ తీసుకున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. జహీరాబాద్‌లో హోమ్‌గార్డు లక్ష్మణ్ పేరున మూడెకరాలు, కర్ణాటకలో ఆరెకరాల వ్యవసాయ భూమి ఉన్నదని గుర్తించారు. కర్ణాటకలోనే మరో 30 ఎకరాలు, బెంగళూరు దేవనహళ్లి వద్ద 11 ఎకరాలు, కామినేని హాస్పిటల్(ఎల్బీనగర్) వద్ద 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు బిలియన్ హౌసింగ్ సొసైటీ వద్ద ఇంద్రకరణ్‌రెడ్డి పేరు మీద 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో నర్వ ఎంఎస్ఎన్ కంపెనీ పేరు మీద ఉన్న 2,000 గజాల స్థలం వంటి వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉన్నదని కోర్టుకు చెప్పారు. దీంతో కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

## విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి..

**వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచన**

విద్యార్థులు ప్రతిరోజూ తమ దినచర్యలో భాగంగా వార్తాపత్రికలు చదవడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం అల్వాల్ మండలంలోని కౌకూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన, అక్కడ విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ.. వేదిక భయం (స్టేజ్ ఫియర్) లేకుండా తమకు వచ్చిన భాషలోనే ధైర్యంగా స్టేజ్ పైన మాట్లాడాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ ఉద్బోధించారు. అనంతరం పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులపై హెడ్ మాస్టర్ మురళీ కృష్ణమూర్తిని అడిగి తెలుసుకోగా, పాఠశాలకు అదనపు తరగతి గదులు అవసరమని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. టాయిలెట్లు, తరగతి గదులు వంటి అవసరమైన మౌలిక వసతులపై తగిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని సూచించారు. అలాగే విద్యార్థులు కోరిన విధంగా క్రీడా సామగ్రిని అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రేణుకా దేవి, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

2026 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఎంహెచ్ఆర్డీ అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల ఉపాధ్యాయులు పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు జూలై 13, 2026 ను చివరి తేదీగా నిర్ణయించినట్లు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసిన అనంతరం, ఆ దరఖాస్తు ప్రింట్ కాపీకి అవసరమైన సంబంధిత ప్రతులను జతచేసి మొత్తం మూడు సెట్లను సిద్ధం చేయాలి. ఈ మూడు సెట్లను సంబంధిత పర్యవేక్షణాధికారి ద్వారా కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జూలై 13వ తేదీ లోపు తప్పనిసరిగా సమర్పించాలని డీఈఓ స్పష్టం చేశారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

## మహిళా సాధికారతకు సురక్షిత పని ప్రదేశాలే పునాది: ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్



మహిళల సాధికారతకు సురక్షితమైన, గౌరవప్రదమైన మరియు లింగ సున్నితత్వంతో కూడిన పని ప్రదేశాలే మూలాధారమని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ ఉద్ఘాటించారు. కాన్పూర్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2013 పోష్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో స్థానిక కమిటీలు, సంస్థల్లోని అంతర్గత కమిటీల పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి శిక్షణా కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ, పోలీసు శాఖలకు చెందిన సీనియర్ అధికారులతో పాటు ఘాటంపూర్ శాసనసభ్యురాలు సరోజ్ కురేల్, ఎస్‌హెచ్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రయాణీకుడి సీట్ ఆక్రమించుకున్న టిటిఇ

**రైల్వేకు రూ. 60 వేల జరిమానా**

రిజర్వేషన్ చేసుకున్న ఒక ప్రయాణీకుడి సీట్ను టిటిఇ అక్రమించు కున్న కేసులో దక్షిణ రైల్వేకు కేరళలోని ఒక వినియోగదారుల కమిషన్ రూ. 60 వేల జరిమానా విధించింది. 'సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ప్రయాణీకుడు తన కష్టార్జితంతో బుక్ చేసుకున్న సీట్ను టిటిఇ అక్రమంగా ఆక్రమించుకుని, ఆ నిస్సహాయ ప్రయాణికుడిని వేరే సీటుకు వెళ్లేలా చేయడం స్పష్టంగా సేవలో లోపం, అన్యాయమైన వాణిజ్య విధానం కిందకే వస్తుంది' అని ఉత్తర్వుల్లో పేర్కొంది. టికెట్ ధరను తిరిగి చెల్లించాలని, అలాగే మానసిక వేదన, ఇబ్బందులకు పరిహారంగా ఫిర్యాదుదారుకు రూ.50 వేలు, ఖర్చుల కింద రూ. 10 వేలు చెల్లించాలని దక్షిణ రైల్వేను కమిషన్ ఆదేశించింది. ఉత్తర్వు కాపీ అందిన తేదీ నుండి 45 రోజుల్లోపు ఈ మొత్తాన్ని చెల్లించాలి, లేనిపక్షంలో, చెల్లింపు జరిగే తేదీ వరకు దీనిపై 6 శాతం వడ్డీ వర్తిస్తుందని కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎర్నాకుళం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు డి.బి. బిను, సభ్యులు వి. రామచంద్రన్ వి, టివిన్ శ్రీవిద్య ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసు పూర్తి వివరాల ప్రకారం కేరళలో అలువా నుండి తిరువనంతపురానికి తన భార్యతో కలిసి ప్రయాణించడానికి రెండు రైలు టికెట్లను ఫిర్యాదుదారుడు బుక్ చేసుకున్నారు. అయితే అలువాలో రైలు ఎక్కేసమాయానికే ఫిర్యాదుదారులకు కేటాయించిన సీటులో టిటిఇ తన సూట్కేస్ ను ఉంచి గొలుసుతో లాక్ చేసి ఆక్రమించుకున్నారు. దీన్ని ప్రశ్నించగా, వేరే సీటులో సర్దుకుపోవాలని టిటిఇ చెప్పారని, అంతేకాకుండా తోటి ప్రయాణికుల సమక్షంలో తనను, తన భార్యను టిటిఇ వేధించారని కూడా ఫిర్యాదుదారు ఆరోపించారు. న్యాయం కోసం వినియోగదారుల కమిషనన్ను ఆశ్రయించారు.

## శరవేగంగా బీబీనగర్ ఏయిమ్స్ పనులు: మంత్రి జేపీ నడ్డాతో కలిసి పనుల సమీక్ష

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి జే.పీ. నడ్డాతో కలిసి తెలంగాణలోని ఏయిమ్స్ బీబీనగర్ భవన నిర్మాణ పనులు, కార్యకలాపాలను గురువారం ప్రజాప్రతినిధులు పరిశీలించి సమీక్షించారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ సంస్థ ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య, మరియు పరిశోధనల్లో అద్భుతమైన పురోగతిని సాధిస్తూ అత్యుత్తమ కేంద్రంగా ఎదుగుతుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఏయిమ్స్ నిర్మాణ పనులు ఇప్పటికే 87 శాతానికి పైగా పూర్తయ్యాయని, ప్రస్తుతం ఆసుపత్రి, అకడమిక్, హాస్టల్ మరియు ఆయుష్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని అధికారులు వివరించారు.



వైద్య విద్య పరంగా ఎంబీబీఎస్, పీజీ, సూపర్-స్పెషాలిటీ, నర్సింగ్, అలైడ్ హెల్త్ కోర్సులలో 900 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 132 మంది ఫ్యాకల్టీ, 133 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు నిరంతరం సేవలందిస్తున్నారు. రోగుల సంరక్షణలో భాగంగా, 250 పడకలు, అత్యాధునిక వ్యాధి నిర్ధారణ, అత్యవసర సేవలతో పాటు పీఎం-జేఏవై, ఆరోగ్యశ్రీ పథకాల కింద ప్రతిరోజూ దాదాపు 1,800 మందికి పైగా అవుట్ పేషెంట్లకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. డిజిటల్ హెల్త్‌కేర్ విభాగంలో తెలంగాణలోని అన్ని 33 జిల్లాల్లో 1.56 లక్షల మందికి పైగా రోగులకు ఈ-సంజీవని ద్వారా టెలికన్సల్టేషన్ సేవలు అందించారు. ఆసుపత్రికి వచ్చే 90 శాతం మంది రోగులను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో అనుసంధానం చేయడం గమనార్హం. పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణల్లోనూ ఏయిమ్స్ బీబీనగర్ ముందంజలో ఉంది. డీఆర్‌డీఓ సహకారంతో కృత్రిమ కాలు (ప్రోస్తెటిక్ లెగ్)ను అభివృద్ధి చేయడంతో పాటు, 129 పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి రూ.64 కోట్ల గ్రాంట్లను సాధించింది. అలాగే 1,150 కి పైగా పరిశోధనలను ప్రచురించింది. సమాజ సేవలో భాగంగా 6 గ్రామాలను దత్తత తీసుకుని, 547 వైద్య శిబిరాల ద్వారా 66,000 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలను చేరువ చేశారు. ప్రజారోగ్యంపై అవగాహన కల్పించేందుకుగాను కొత్తగా ఒక కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, కేంద్ర మంత్రి జే.పీ. నడ్డా మార్గదర్శకత్వంలో తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, సరసమైన వైద్య సేవలను అందించడంలో బీబీనగర్ ఏయిమ్స్ విప్లవాత్మక పాత్ర పోషిస్తోందని నేతలు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు కే.లక్ష్మణ్,అరుణ, చామల.కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కండి

**స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలని పరిశ్రమలకు మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన యాజమాన్యాలు**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకంలో భాగస్వాములు కావాలని, సామాజిక బాధ్యతతో స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించి లబ్ధిదారులకు అండగా నిలవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశ్రమల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని వారు స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అనే అంశాలపై ఆయా పరిశ్రమల ప్రతినిధులతో మంత్రులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అభివర్ణించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఇందులో ఇప్పటికే గణనీయంగా 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన 15 శాతం ఇళ్ల నిర్మాణాలు కూడా వివిధ దశల్లో శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు, అలాగే కోర్ సిటీ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా మరో వెయ్యి నుంచి 1500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇళ్ల మంజూరు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, మూడు, నాలుగవ విడతల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా నూరు శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణం చేపట్టడం తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని, ఈ విషయంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రులు గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా రాజీ పడకుండా, ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. మంత్రుల విజ్ఞప్తికి పరిశ్రమల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. పేదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం చేస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా ప్రజలు చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, లబ్ధిదారులకు ఈ మెటీరియల్ ఎలా చేరవేయాలన్న దానిపై పకడ్బందీ రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. ఈ కీలక సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులతో పాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల శశాంక తదితరులు పాల్గొన్నారు.

## మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు

తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను వారి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,